సీరియల్



[పన్నెండవ భాగము]

హాలీవుడ్ మనుషులతో నిండిన ట్రక్కులు, పవర్ వాగన్, జీపులూ, ఆ అడివిలో ముందుకి భారంగా కదుల్తున్నాయి. ఉదయాన్నించీ పని చేసిన డ్రైవర్ అలసిపోటంవల్ల -కో-ప్రొడ్యూసర్ పాల్ మావ్‌ని రిక్వెస్ట్ చేసి మొదటి జీపుని నేనే డ్రైవ్ చేస్తున్నాను.

వెనకాల సీట్లో శాన్యోరా, డైరెక్టర్, నటి బార్బరా ఆశీనులై వున్నారు. ముందు సీట్లో నేనూ, నా ప్రక్కగా డ్రైవర్, పాల్ మావ్, గైడ్ జెరీ వున్నాం.

దృష్టిని డ్రైవింగ్ మీద లగ్నంచేసి చెట్లమధ్యనుంచి

జీపుని పోనిస్తున్నాను, ఆ అడవిలో చోటుచేసుకొని ముందుకి పోతుతున్న వెనకాల వాహనాల్ని అప్పుడప్పుడు 'రియర్ వ్యూ'లో చూస్తూ, కాలం బరువుగా దొర్లడం యిష్టంలేక, పాల్ మావ్ తీయబోయే సన్నివేశాల కబుర్లు చెబుతున్నాడు. నేను డ్రైవింగ్ చేస్తూనే అప్పుడప్పుడు ప్రశ్నలు వేసి, సందేహాలు తీర్చుకుంటున్నాను. ఉన్నట్టుండి ట్రక్కుల వెనక భాగం నుండి "ధన్..." మని రైఫిల్ శబ్దం వినబడింది. అందరూ అదిరిపడ్డాం ఆ హఠాత్ శబ్దానికి.

ఎవరు పేల్చారు?

ఎందుకు పేల్చి వుంటారు?

"భయంకర్! స్టాప్ ది జీప్!" అరిచాడు పాల్ మావ్.

సడన్ బ్రేకు కొట్టి యింజన్ ఆఫ్ చేసి చటుక్కున క్రిందకు దూకాను, కుడివేపు నుంచి.

నా వెనుకగా అందరూ దిగిపోయారు. అప్పటికి నా వెనకాల వాహనాలన్నీ ఆగివున్నాయి.

"వాట్ ది హెల్ హాపెండ్ దేర్?" అరచాడు పాల్ మావ్ వెనకవున్న ట్రక్కులవేపు గబగబా అడుగు లేస్తూ.

మేమందరం పాల్ మావ్‌ని అనుసరించాము. ఆఖరి ట్రక్కులోంచి కాకీదుస్తులు ధరించిన ఓ గార్డు చేతిలో రైఫిల్‌తో పరిగెట్టుకుంటు మావైపువచ్చాడు. పాల్ మావ్ వైపుతిరిగి "సార్! వెనకాతల ట్రక్కులో నేను కాపలా కాస్తున్నాను ఏ జంతువువల్లా అపాయం రాకుండా... కానీ..." ఒగుర్చుతూ ఆగిపోయాడు గార్డు.

"కానీ...! యూ బ్రూట్ ఏమయింది?" అర్చాడు పాల్ మావ్.

"సార్!... వెనకాల చెట్లలోంచి హఠాత్తుగా రెండు బాణాలు, కదులుతున్న మా ట్రక్కులోకి దూసుకు వచ్చాయి. నా ప్రక్కగా నిలబడి మాట్లాడుతున్న యిద్దరు పోర్టర్ వర్రాళ్ళ గుండెల్లోకి దూసుకుపోయాయి... బాణాలు వేసిన వ్యక్తులెవరో కనపడలేదు. అయినా గుడ్డిగా చెట్లలోకి రైఫిల్ మాత్రం పేల్చాను. మనవాళ్ళ శరీరం రంగు మారిపోతోంది. విషపు బాణాలేమో" అన్నాడు వణికిపోతూ గార్డ్.

అందరూ అదిరిపడ్డాం అతని చివరి మాటలకు.

"పాయిజన్డ్ యారోస్" గొణిగాడు పాల్మావ్. "పద చూద్దాం వాళ్ళని."

అంతా అటువేపు పరిగెత్తాం.

విషయం తెల్సి, మిగతా ట్రక్కుల్లోని మనుషులు బిలబిలాదిగి మా వెంటబడ్డారు.

నేలమీదకు దింపబడ్డ రెండు శరీరాలచుట్టూ జనమంతా మూగారు.

పాల్మావ్ ప్రక్కగా, చోటుచేసుకుని ఆ యిద్దరి దేహాలవేపు చూశాను.

అప్పటికే పోర్టర్ వర్రాళ్ళిద్దరూ మరణించారు!!

మృతదేహాలు రెండూ, నల్లగా కమిలిపోయివున్నాయి. బాణాలు సూటిగా గుండెల్లోకినాటుకున్నాయి. "బా... సూం...టో...స్!" నా వెనక నిలబడ్డ గైడ్ జైరీ సన్నగా గొణిగేడు.

"వాట్ బాసుంటోస్?" అన్నాను ఉలిక్కిపడి వెనక్కు తిరిగి.

శవాలను, మోకాళ్ళమీద కూర్చుని పరీక్షిస్తున్న

పాల్ మాన్ కూడా ఆ మాటలకు వెనక్కి తిరిగేడు.

"మిస్టర్ పాల్ మాన్! యిది బాసుంటోల పనే అయ్యుంటుంది. బాసుంటో అంటే యిక్కడ ఓ అడవి తెగ మనుషులు. వాళ్ళ ప్రాంతంలో యితరుల నెవ్వరిని కాలు పెట్టనివ్వరు. ప్రవేశించిన వారిని చంపిగాని వదలరు" అంటూ ఒక్క క్షణం ఆగి ఊపిరి పీల్చుకున్నాడు జైరీ.

అప్పుడే జనంలో అలజడి రేగింది. అంతా భయంగా గొణుక్కుంటున్నారు.

"సర్! బాసుంటో ఆటవికులు సాధారణంగా గుంపులు గుంపులుగా యుద్ధం చెయ్యరు. ఓపెన్ గావున్న మైదానాల్లాంటి ప్రదేశాల్లో వీరు ఎదుర్కోరు. చెట్లచాటు వ్యవహారం వారిది. దొంగదెబ్బలకు వాళ్ళకు పెట్టింది పేరు. ఇది కేవలం మొదటి హెచ్చరిక సర్!

వాళ్ళగూడెం ప్రాంతాల్లో యితరులు మసలకూడదు. మన వాహనాలు స్పీడ్ ఎక్కించాలి. స్నేహశీలురయిన మనుషులుండే 'మాసయ్' గూడెం చేరుకునే వరకూ మనకు బాసుంటోలనుండి ప్రమాదం వెంటాడుతూనే వుంటుంది. రైఫిళ్ళ కాపలా రెట్టింపు చేయాలి_ నైట్ కాంపులోనూ, ట్రావిలింగ్ ట్రక్సులోనూ" అంటూ ఆగాడు జెయిరీ.

"డామిట్! నువ్వు ఈ విషయాలు ముందు యెందుకు చెప్పలేదు?" తోకతొక్కిన తాచులా లేచాడు పాల్ మాన్.

"మిస్టర్ పాల్ మాన్! నేను చెప్పి కొత్తగా చెయ్యగలిగేదేమీ లేదు. పైగా చెప్పడంవల్ల ముందుగానే మన

మనుషులందర్నీ భయపెట్టిన వాడ్నవుతాను.''

రెండు నిమిషాలపాటి ఆ ప్రదేశమంతటా చావు నిశ్శబ్దం అలుముకుంది.

చీఫ్ డాక్టర్, శవాల ప్రక్కగా మోకాళ్ళమీద కూర్చొని, గుండెల్నుంచి పెకలించబడిన బాణపు మొనల్ని భూతద్దంలో పరీక్షిస్తున్నాడు.

''మిస్టర్ పాల్‌మావ్! నేను క్షేమంగా హాలీవుడ్ చేరతానో లేదో?...లక్షలాది నా అభిమానుల కోసం, సంపాదించిన మిలియన్ల డబ్బుకోసం నేను బ్రతకాలి... దయచేసి తగిన రక్షణతో నన్ను వెనక్కి పంపించండి... మనం బొసుంటో ప్రాంతంగుండా ప్రయాణించడం కోరి వితో తల గోక్కోవడమే...'' భయంగా ఘట్టిగా పలికింది బార్బరా. ఆమె సుందరమైన దేహం సన్నగా వణుకుతోంది.

''మిస్ బార్బరా! ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్! బొసుంటోలు కేవలం నిన్నుమాత్రం హతమార్చరు! ఇంత మంది వున్నాం. ధైర్యం తెచ్చుకో'' అన్నాను ఏకవచనంలో, స్నేహపూర్వకంగా ఆమె భుజం తడుతూ.

పాల్‌మావ్ స్థాణువులా నిలబడిపోయాడు.

అంతా భయంగా, విచిత్రంగా చూస్తున్నారు...

''నో మిస్టర్ భయంకర్! నాకయింకా జీవించాలని ఉంది'' అంది తల అడ్డంగా ఊపుతూ, బార్బరా వణికే కంఠంతో.

శానోర్యరాకు సైగ చేశాను.

ఆమె బార్బరా భుజంచుట్టూ చేతులువేసి అవతలికి తీసుకెళ్ళింది.

పాల్ మాన్ ముఖం బిగుసుకుంది. అతని పెదవులు మెల్లిగా కదిలాయి. "ఆల్ రైట్ జంటిల్మన్! యిక నా నిర్ణయం వినండి. బాసుంటోలకు ఏది యిష్టమో యేది అయిష్టమో నా కనవసరం! ఐ జస్ట్ డోన్ట్ కేర్ దట్ బాస్టర్డ్స్! మనం యిదే మార్గంగుండా ప్రయాణిస్తాం, యింకోటి వీలుగలేదు కాబట్టి. మన ప్రొడ్యూసర్ కౌన్సిల్ కొన్ని లక్షలఖర్చుమీద ఈ భారీచిత్ర నిర్మాణం తల పెట్టింది. ఆ డబ్బు వృధా కావడానికి వీలులేదు. సాహసికంగా మనం జర్నీ కంటిన్యూ చేస్తాం" అన్నాడు దృఢంగా, కోటుజేబులోంచి సిగార్ పైపు బయటికితీసి ముట్టించుకుంటూ.

ఈసారి డైరెక్టర్ కలుగజేసుకున్నాడు.

"మిస్టర్ పాల్ మాన్! మనతో ప్రయాణిస్తూన్న వివిధ టెక్నీషియనులకూ, అయిదుగురు స్త్రీలకూ, ఇంకా కెమెరా మనుషులకూ, పోర్టర్లకూ, అవుట్ డోర్ బాయ్స్ కి... అందరి క్షేమానికీ, అందరి ప్రాణాలకీ మీరే బాధ్యులవుతారు. బాసుంటోల సహాయం లేకుండా వారి ప్రాంతంలోంచి మనం పయనించలేం."

"డామ్ యువర్ ఒపినియన్ మైడియర్ డైరెక్టర్! పిరికిమందు నూరకు. సినిమాలు డైరెక్ట్ చేసేవాడవి, నిజ జీవితంలోగూడా గైడెన్స్ యివ్వడం నేర్చుకో" అరిచాడు అసహనంగా పాల్ మాన్.

డైరెక్టర్ ముఖం మాడిపోయింది.

వాతావరణంలో టెన్షన్ పెరిగినట్లు గుర్తించాను.

"మిస్టర్ భయంకర్! ఈ విషయంలో నీ అభిప్రాయం ఏమిటి?" కోపం తగ్గించుకొని అడిగాడు పాల్ మాన్.

నవ్వుతూ, స్నేహపూర్వకంగా అతని భుజాలమీద చేతులు వేసాను.

“అయామ్‌సారీ మిస్టర్ పాల్‌మాన్! నేను దారిన పొయ్యే దానయ్యను. మీ స్వంత విషయాల్లో స్ట్రేంజర్‌గా నేను జోక్యంకలుగ జేసుకోవడం అసమంజసంగావుంటుంది నిర్ణయం తీసుకోవాల్సింది మీరు. అయితే ఒకటిమాత్రం చెప్పగలను. ప్రమాదాలు నాకూ, కొన్యోరాకు కొత్త కాదు. మీరు తిరిగి వెళ్ళిపోతానంటే ఐవిల్ సే ఓకే. సాహసించి ముందుకు పయనిస్తామంటే, మాకున్న కొద్ది తెలివి తేటలతో, మమ్మల్ని మేం రక్షించుకుంటూ, మిమ్మల్ని కాపాడ్డానికి శాయశక్తులా ప్రయత్నం చేస్తాం” అన్నాను దృఢంగా.

పాల్‌మాన్ మౌనంగా తలపంకించాడు.

“నువ్వు చెప్పింది బావుంది మిస్టర్ భయంకర్! నాగరికత లేని ఆటవికులకు భయపడి, తోక ముడుచుకొని వెనక్కి పారిపోతే—అంత అవమానం మరొకటి లేదు. ఈ చిత్రానికి పెట్టుబడి పెట్టిన ప్రొడ్యూసర్లు మమ్మల్ని దుమ్మెత్తి పోస్తారు.

సినిమా జర్నలిస్టులు వేళాకోళంచేసి—‘ది డేరింగ్ ఫిల్మ్ యూనిట్ హు రాన్ బాక్’ అన్న హెడ్డింగ్ కింద మా ఫోటోలు ముద్రిస్తారు. ఈ బాడ్ ప్రాపగాండాతో మా యూనిట్‌లోని మనుషులెవ్వరికీ భవిష్యత్ వుండదు తప్పదు...వుయ్ ఆర్ గోయింగ్ ఫార్వర్డ్” అన్నాడు తల ఊపుతూ పాల్‌మాన్.

అంతలో టీమ్ డాక్టర్ శవాన్ని పరీక్షించి పైకి లేచాడు. ‘గ్లౌ’ ముడిలూజ్ చేసుకుంటూ “మిస్టర్ పాల్

మావ్! విషం బాణపు మొనకులేదు. మొన వెనకాలి భాగానవుంది నల్లరంగులో" అన్నాడతను విచిత్రంగా చూస్తూ.

"ఎందుచేత?" అడిగేడు పాల్‌మావ్.

"తెలియదు. విషం వివరాలుకూడా నాకు తెలియదు. లేకపోతే విరుగుడు గురించి ఆలోచించే వాడిని."

"మిస్టర్ పాల్‌మావ్! విషం డైరెక్టుగా బాణపు మొనలకు ఎందుకు పూయబడలేదో నేనూహించ గలను" అన్నాను గొంతు సవరించుకుంటూ.

పాల్‌మావ్ ఆతృతగా చూసాడు. "ఎందుచేత?"

"జస్ట్ ఎ పాయింట్ ఆఫ్ కామన్ సెన్స్! అదిచాల భయంకరమైన పాయిజన్ అయుండాలి.ఆటవికులు సాధారణంగా బాణాల్ని వీపువెనక ఓ కొయ్యగొట్టం అమర్చి పెట్టుకుంటూరు. పాయిజన్ డైరెక్టుగా మొనకుపూస్తే, బయటకుతీసి ఉపయోగించేటప్పుడుగాని. అటూ యిటూ కదిలేటప్పుడుగానీ పొరపాటున ఆ బాణాలమొన యే వేలికో, వీపుకో, మరొకరి శరీరానికో గుచ్చుకుంటే— ప్రమాదం. అందుచేత పాయిజన్ యారో హెడ్ వెనకాల పూసి వుండొచ్చు" అంటూ ఆగాను.

గైడ్ జెయిరీ హఠాత్తుగా మాముందు కొచ్చేడు. జంటిల్మన్! భయంకర్ లాజిక్‌లో నిజం పూర్తిగావుంది. ఆ విషయంలో మీకు మరికొన్ని వివరాలు యివ్వగలనని అనుకుంటున్నాను. మాతాత ముత్తాతలనుండి అందరూ 'జంగిల్ గైడ్' వృత్తిలో పని చేశారు. అందువల్ల నేను మరికొన్ని విషయాలు మీకు చెప్పగలను.

ఆ బాణాలకి పూయబడిన విషాన్ని 'యాకోకాన్

ఫిరా' అనే మొక్కల ఆకులనుండి తయారు చేస్తారు. వాటినుండి విషాన్ని చేయడానికి బాసుంటోజాతి మనుషులే ఎంతో భయపడతారు. కారణం ఆ'విధానం' అంత ప్రమాదకరమైనది కాబట్టి. ఎంతో శ్రద్ధతో, యెంతో మెలకువతో ఆ విషాన్ని తయారుచేస్తారు.

ముందు జాగ్రత్తగా బాసుంటోలు ఆ విషాన్ని గూడెంలో తయారు చేయకుండా-అడవిలో మంచిప్రదేశాన్ని వెతుక్కుంటారు. అక్కడ ఆ మొక్కల్ని వుడకబెట్టి—యిగురబెట్టి వాళ్ళ పద్ధతిలో విషాన్ని తయారుచేసి మెల్లిగా బాణాలకు పూస్తారు. మందుగుండు సామగ్రి తయారు చేసేటప్పుడు మనంయెంతో జాగ్రత్త వహిస్తాం అలాగే బాసుంటో తెగ-మనుషులు ప్రత్యేకంగా, విశేషమైన కాలాన్ని ఖర్చుపెట్టి ఆ విషాన్ని తయారుచేస్తారు.

ఆవిషం ఎంతటి భయంకరమైనదీ అంటే, ఏ చెట్టు ముల్లో తగిలి చర్మంకొంచెం గీసుకుపోతే, ఆ గీసుకుపోయిన ప్రాంతంమీద ఒక్కబొట్టు 'యాకో' విషం తగిలేచాలు అది రక్తంలోకి ప్రవేశించి—మాక్సిమమ్ మూడు నాలుగు నిమిషాలలో మరణిస్తాడు మనిషి.

అయితే బాణపు మొనలకు పూయబడిన 'యాకో'విషం తాజాదికాక వారం పదిరోజులయి ఉంటే ఆ యారో హెడ్ మీద దుమ్ముచేరే అవకాశముంది. ఇలాంటి సందర్భాలలో బాణం గుచ్చుకోబడిన మనిషి పది, పదిహేను నిమిషాలదాకా బ్రతకడానికి అవకాశం వుంది. ఒకోసారి పూయబడిన విషం పదిహేను, ఇరవైరోజులు దాటివున్నప్పుడు— అది ఎండిపోయి విషప్రభావం నిర్వీర్యమౌతుంది ఇలాంటి పరిస్థితుల్లో మనిషి మరణించే ప్రమాదంలేదు" అంటూ ఆగి, భారంగా ఊపిరి వదిలాడు సైడ్ జైరీ.

అప్పటిదాకా ఆసక్తిగావిన్న నేను "మిస్టర్ జెయిరీ అయితే దానికి విరుగుడు లేదంటావా?" అడిగాను.

అందరితోపాటు పాల్‌మావ్, డాక్టర్ కూడా జెయిరీ జవాబుకోసం ఉత్సుకతతో చూడసాగారు. ఒకక్షణం మౌనం వహించి "ఉంది మిస్టర్ భయంకర్!" అన్నాడు గంభీరంగా జెయిరీ.

"అయితే అది అంత ఉపయోగ పడకపోవచ్చు. ఎందుకంటే బాణం నాటుకున్న మనిషికి కేవలం— మాక్సిమమ్ మూడు నిమిషాల్లోగా యింజెక్షన్ యివ్వాలి. అప్పుడు అతను బ్రతకొచ్చు"

"ఇంజెక్షన్ విత్ వాట్?" అన్నాడు డాక్టర్ కళ్ళ జోడుతీసి చేతిలో పట్టుకుంటూ.

"ఏమిటా మందు?" పాల్‌మావ్ అడిగాడు.

"అమ్మోనియం కార్బొనేట్ కొన్ని కేసుల్లో ఉప యోగాన్నిచ్చింది. అయితే 'కోరమీన్' ఇంజక్టుచేస్తే మనిషి తప్పక బ్రతుకుతాడు. అసలు విషయం మరచిపో కూడదు. మూడునిమిషాల గడువులో... లేకపోతే అప్ప టికే ఆలస్యమైపోతుంది" అన్నాడు జెయిరీ.

"డాక్టర్! కోరమీన్ వుందా మన దగ్గర?"అడిగాడు పాల్‌మావ్.

ఆలోచిస్తూ నిలబడి పోయాడు డాక్టర్.

"జ్ఞాపకంలేదు మిస్టర్ పాల్‌మావ్! కంగారుగా బయల్దేరాం మనం. ఎన్నో మెడిసన్స్ హడావుడిగా సర్దాను. వెళ్ళి వెదికివస్తాను. కోరమీన్ వుంటే మనం చాలవరకు అదృష్టవంతులమే"అంటూ ఎవరి జవాబుకోసం ఎదురుచూడకుండా ట్రక్కువైపు పరిగెత్తాడు డాక్టర్.

డాక్టర్ అలా వెళ్ళగానే అడిగాడు గైడ్‌ని "మిస్టర్ జెయిరీ! అసలు ఇతరుల్ని బాసుంటో జాతివాళ్ళు ఎందుకు తమ ప్రాంతంలో మసలనివ్వరు?"

జెయిరీ నవ్వాడు. "ఆలోచించండి మిస్టర్ భయంకర్! ఇదికూడా కామన్ సెన్స్ పాయింటే..."

తీవ్రంగా ఆలోచించ సాగాను...

పాల్‌మాల్ కూడా నాకేసి చూస్తున్నాడు.

మెదడులో ఓ ఆలోచన తళుక్కుమంది.

"అర్థమైంది మిస్టర్ జెయిరీ? ఎవరో నాగరికులు లేదా నాగరికుడు ఎప్పుడో ఈ బాసుంటో మనుషులకు అన్యాయము లేదా అపకారం చేసివుంటాడు. అప్పట్నించీ బయటి మనుషులంటే పగ పేరుకుపోయి వుంటుంది వాళ్ళలో" అన్నాను ఉత్సాహంగా.

మరోసారి నవ్వాడు జెయిరీ. "యువార్ కరెక్ట్ ఫ్రెండ్! అలాగే చెప్పారు మా పూర్వీకులు."

"మరో విషయం. ఆ విషాన్ని కేవలం మనుషుల్ని చంపడానికే ఉపయోగిస్తారా?"

"కాదు. ఎక్కువగా జంతువులను చంపటానికి. చర్మాలు మొలలచుట్టూ ధరిస్తారు."

పరిగెత్తుకొచ్చాడు డాక్టర్ మా మధ్యకి—

"డాక్టర్! ఎస్-ఆర్-నో?" అనుమానంగా అడిగాడు పాల్‌మాన్.

"ఎస్. మిస్టర్ పాల్‌మాన్. కోరమీన్ వుంది మన దగ్గర"—ఒగుర్చుతూ పలికాడు డాక్టర్ నవ్వుముఖంతో.

అంతా స్వేచ్ఛగా నిట్టూర్పు విడిచాం.

పాల్‌మాన్ కొంచెం వెనక్కి నడిచి, రెండు చేతులు

పైకెత్తి "లుక్ హియర్! ఎవ్విరిబడీ" అంటూ కేకలు పెట్టాడు.

జనం అంతా పాల్ మావ్ చెప్పబోయే విషయం వినడంకోసం తలెత్తి అతడ్ని చూడసాగారు.

"జంటిల్ మన్! మనం ముందుకు ప్రయాణం సాగించ బోతున్నాం! ప్రకాషనరీ మెజర్స్ ఉద్ధృతం చేస్తున్నాను. ఇప్పట్నించీ ప్రతి ట్రక్కుమీద యిద్దరు సాయుధ గార్డులని ఎరేంజ్ చేస్తున్నాను.

"క్రోబాల్ట్!"

"ఎస్సార్" చెయ్యెత్తాడు ఒకడు జనంలోంచి.

"రాబిన్!"

"ఎస్సార్" మరొకడు చెయ్యెత్తాడు.

"మీరిద్దరూ దృఢంగా ఉంటారు. వెనకాల ట్రక్కుమీద కాపలా కాయాలి మీరు" అంటూ కొంతమంది పేర్లను పిలిచి, వివిధ వాహనాలమీద వాళ్ళను గార్డ్స్ క్రింద ఎరేంజ్ చేసాడు పాల్ మావ్.

"నా గార్డ్స్! నా మాటలు వినండి. మీరంతా అతి మెలకువతో జాగ్రత్తగా కాపలా కాయాలి. మీ కళ్ళెప్పుడూ తెరిచివుండాలి. ఏదయినా అనుమానం అనిపిస్తే చూసిన మరుక్షణంలో కాదు, చూసిన 'క్షణం'లో కాల్చి పారేయండి. మీ జీతాలు ఇప్పట్నుంచీ రెట్టింపు చేస్తున్నాను. కాయకష్టులా మన మనుషులను రక్షిస్తూ, వారి ప్రశంసలందుకోండి.

పోతే రాత్రి వేళల్లో మనం మకాంకోసం గుడారాలు దింపవలసి ఉంటుంది. నైట్ క్యాంపుని కాపలాకాసే వ్యక్తుల్ని మీనుండే నేను ఎన్నుకుంటాను. ఒక్కొ

రాత్రికి వందడాలర్లు ఎక్స్‌ట్రా పే చేయబడుతుంది. టీ, సిగరెట్స్ కావలసినన్ని సప్లయి చేయబడతాయి. ఎవ్వరూ రాత్రివేళల్లో మత్తుపదార్థాలు సేవించడానికి వీలులేదు. మీ డ్యూటీచార్టు మరో అరగంటలో తయారు చేసి ఇస్తాను. మన మనుషుల్లో ఎవ్వరూ మిస్ కాకూడదు. ముందు జాగ్రత్తగా అందరికీ ఈ అడవిప్లాన్ ఒకొక్కటి కాపీ యివ్వబడుతుంది. యుమస్టబీ కేర్‌ఫుల్! ఓ. కే?" మిలిటరీ ఆఫీసర్‌లా పొలికేక పెట్టాడు పాల్‌మావ్.

"ఎస్సార్!" అన్నారు నిర్ణయించబడ్డ గార్డులంతా చేతులెత్తి.

* * *

సాయంత్రం ఐదు గంటలవుతుంది.

హాలివుడ్ వాహనాలు ఆ అడవిలో ముందుకు కదులుతున్నాయి. మొదటి జీప్‌ని ఈసారి నేను డ్రైవ్ చేయడంలేదు. దానికి నియమించబడ్డ ప్రత్యేక వ్యక్తి జీపుని తోలుతున్నాడు. అటు, యిటు కనబడుతున్న చెట్లవేపు సూటిగా చూస్తున్నాను.

నా జేబులో పాల్‌మావ్ యిచ్చిన పిస్తోలువుంది. జీపులో వాతావరణం భయంకరమైన ప్రశాంతతలోవుంది జీపు మైల్లశబ్దం, మా వాహనం వెనకాల కదులుతున్న ట్రక్కుల శబ్దంతప్ప మరేమీ వినిపించటంలేదు.

ఇప్పుడు ప్రయాణిస్తున్నది ప్రమాదకరమైన 'బాసుంటో' తెగ మనుషుల ప్రాంతంగుండా—అని జీపులో కూర్చున్న వారందరికీ తెలుసు!

ఏ క్షణాన్నైనా ఆ అడవి మనుషులు దాడి చేయవచ్చు. ఆలోచనలతో సిగరెట్టు పై సిగరెట్టు కాలుస్తుండడం

వల్ల నోరు పాడైనట్లనిపించింది.

"మిస్టర్ పాల్ మాన్! వాటర్ కావాలి" అడిగాను చేదయిన నోటిని నాలుకతో తడుపుకుంటూ.

పాల్ మాన్ మౌనంగా కాలిదగ్గరనుండి ప్లాస్టిక్ వాటర్ బ్యాగ్ తీసి నా చేతికిచ్చారు. మూత తెరిచాను. ఆశ్చర్యం!

ఉదారంగులో వున్నాయి నీళ్ళు!

"మిస్టర్ పాల్ మాన్!" పిల్చాను అతనివైపు చూస్తూ.

అర్థమైంది అన్నట్లు తలవూపి నవ్వి చెప్పాడు పాల్ మాన్.

"అవి హాలివుడ్ నీళ్ళు. అడవిలో ఎక్కడ తిప్పలు పడాల్సి వస్తుందో అని ఒకటాంకరు మంచినీళ్ళు మోసుకొచ్చాం. నిలవ వుండటానికి పెర్మాంగనేట్ కలిపాం అందులో. కాస్త ఎక్కువ అయ్యుంటుంది. అదే ఆ రంగుకు కారణం. నాట్ డేంజరస్. తాగండి. కాని ఎక్కువగా తాగొద్దు. తక్కువ స్టాక్ ఉంది మనదగ్గర."

బాటిల్ ఎత్తిపెట్టి రెండుగుక్కలు తాగి మళ్ళీమూత బిగించాను.

"మిస్టర్ భయంకర్! ఏమిటి మీరు చేసిన పని?" అన్నారు కోపంగా పాల్ మాన్.

"ఏమిటి? ఎక్కువ త్రాగానా? సారీ!"

"అదికాదు. మీరు ఎత్తిపెట్టుకొని త్రాగారు."

"ఓహ్! ఎంగిలి"

"మిస్టర్ భయంకర్! అమెరికన్స్ కి, బ్రిటిషర్స్ కి ఎంగిలి ఉండదు. అలా చేయడం ఎదుటి వ్యక్తిని అవమానించి నట్టు—మాకు."

“ఐసీ...అయామ్ సారీ. మీరు చెప్పింది గుడ్ మానర్స్.”

“అంతేకాదు. అమెరికన్లకి, ఇంగ్లీషు వాళ్ళకి మరో అలవాటుంది. హోటల్లోగాని, ఎక్కడైనా, వొకడు డబ్బుయిస్తే దాన్ని ఎదుటివ్యక్తి అక్కడే లెక్కపెట్టుకోకూడదు. అలా చేస్తే డబ్బు ఇచ్చిన వ్యక్తిని అవమానించి నట్లవుతుంది.”

“మిస్టర్ పాల్ మాన్! మీరు చాలా మంచి విషయాలు చెప్పారు. భారతీయులు ప్రాథమికంగా ఇంకా ఎంతో నేర్చుకోవాలి” అన్నాను సిగ్గుపడుతూ.

పాల్ మాన్ ఇంకా ఏదో అనబోతుండగా గైడ్ జెయిరీ మధ్యలో కలగజేసున్నాడు, “సర్! మీరువాటర్ స్టాక్ ఎంతో లేదన్నారుకదూ!”

పాల్ మాన్ అతనికేసి తిరిగి నవ్వాడు.

“ఏం, నీకు దాహంగా ఉందా యిపుడు?”

జెయిరీ నవ్వలేదు. “అదికాదు. మీకు కావలసినంత నీరు సప్లయిచేస్తాను” అన్నాడు జీప్ అద్దంలోంచి బయటకిచూస్తూ..

“అఫ్కోర్స్! కావాలి. కాని ఎక్కణ్నించి?” అడిగాడు వింతగా చూస్తూ పాల్ మాన్.

“ఎదురుగా చూడండి ముందువున్న నదివైపు” అన్నాడు జెయిరీ చూపుడువేలితో అద్దంలోంచి ముందుకు చూపిస్తూ. పాల్ మాన్, నేను అద్దంగుండా బయటికి పరీక్షగా చూసాం.

“యూ డామ్ఫూల్! నదిలాంటి దేమీ లేదే ఎదుటగా” అన్నాడు పాల్ మాన్ కోపంగా.

"పొడుగునా ఇక్కణ్నించి రాతి నేల పరచుకొని ఉంది" అన్నాను ఇంకేం చెప్పాలో తెలియక.

"ఆ విషయం అలావుంచండి. మీరు నదిమీద ఎప్పుడయినా నడిచారా?" అడిగేడు నవ్వుతూ జెయిరీ.

"మిస్టర్ భయంకర్! మీరేమీ అనుకోకండి. బాసుంటోలు మనవాళ్ళిద్దర్నీ ఘోరంగా చంపారు. అప్పట్నించీ ఈ పిచ్చివాగుడు." అన్నాడు పాల్ మాన్ వ్యంగ్యంగా.

"డియర్ ప్రొఫెస్సర్! మనకు కావలసినది స్వచ్ఛమైన నీరు దొరుకుతుంది ఆనదిలోంచి. ట్యూబ్ సాయంతో టాంకర్ నిండా నింపుదాం" అన్నాడు జెయిరీ.

పాల్ మాన్, నేనూ నిజంగా పిచ్చివాణ్ని చూసినట్టు జెయిరీని చూడసాగాం.

వెనకసీట్లోని శాన్యోరా, బార్బరా సుసాన్ జెయిరీ వంక పజిల్డ్ గా చూస్తున్నారు.

"జీప్ ఆపండి" అన్నాడు జెయిరీ.

డ్రయివర్ పాల్ మాన్ వంక చూసాడు.

"స్టాప్" అన్నాడు పాల్ మాన్.

రాతి నేలమీద జీప్ ఆగివుంది. రెండుసార్లు హారన్ కొట్టాడు డ్రయివర్. ఆ కోడ్ అర్థమై వెనక ట్రక్కులు ఆగాయి.

అంతా జీపు దిగాం.

"భయంకర్, మీవద్ద పిస్తోలు యిలా యివ్వండి" అన్నాడు జెయిరీ.

అతనివంక విచిత్రంగా చూస్తూ యాంత్రికంగా కోటు జేబులోంచి పిస్తోలుతీసి, అతని చేతిలో పెట్టాను.

నేలమీద గొంతుకూర్చుని జెయిరీ—పిస్తోలుతో ఆ

రాతినేలమీద టపటపా తాటించసాగాడు. ఓచోట నేల బోలు శబ్దం వచ్చినట్లయింది. అక్కడ పిస్తోలు మడమతో గట్టిగా కొట్టాడు. ప్లాస్టిక్‌లా టప్పున చితికింది రాయి. రాతిక్రింద ఏదో ప్రవహిస్తున్నట్లు శబ్దం అవుతోంది. మెల్లిగా నాకు విషయం అర్థం కాసాగింది.

జైరీ రాతినేలమీద కొంతసేపటికి పెద్ద కన్నం ఏర్పరచాడు. అంతే! అందులోంచి సర్రున ఫౌంటెన్‌లా నీళ్ళు దూసుకొచ్చాయి పైకి.

పాల్ మాన్ కళ్ళు మెరిసాయి.

"మిస్టర్ జైరీ! రాతిలో కప్ప గురించి విన్నానుగాని, రాతిలోనుంచి నీళ్ళు రావడం, సంగతి వినడం, చూడ్డం ఇదే మొదటిసారి."

"మిస్టర్ జైరీ! రాతినేల క్రింద నది ప్రవహించడం ఎలా సాధ్యం అయింది?" అడిగింది—అప్పుడే ప్రక్కగా వచ్చిన శాన్యోరా!

"సిస్టర్! నిజమైన నేలకాదు. ఎప్పుడో లావా ప్రవహించింది ఈ నదిమీద. తరువాత లావా గట్టిపడి రాతినేలగా ఏర్పడింది పై భాగం. ఇలాంటివాటిని 'జిమా స్ప్రింగ్' అంటారు. ఇదిగో నీరు చూడండి. గాజులా తెల్లగా స్వచ్ఛంగా ఉంటుంది. అందుకే అన్నాను మన మిప్పుడు నదిమీద నిలబడ్డామని" చెప్పాడు జైరీ—జైల్లోంచి విడివడినట్లు స్వేచ్ఛగా వేగంగా పైకి తన్నుకొస్తున్న నీటిని చూపుతూ.

"ఇటీజ్ జస్ట్ మార్వెలెస్!" అంది నటి—బార్బరా భుజాలెగుర వేస్తూ.

ఏదో అనబోతూ త్రుళ్ళిపడ్డాను.

తటాలున మా కడ్డంగావున్న శాన్యోరానీ సూసాన్‌నీ ప్రక్కకి త్రోయడం, జైరీ చేతిలోని పిస్తోలు చటుక్కున లాక్కోవడం, రెండు బాణాలు రివ్వున నాకటూ ఇటూ దూసుకుపోవడం...అంతా క్షణంలో జరిగిపోయింది!

అవి ఆ స్త్రీలకిద్దరికీ వెన్నులో గుచ్చుకోవలసిన విషపు బాణాలు.

"ఎవ్విరీబడీ గెట్ ఇన్‌టు జీప్!" అర్చాను పిచ్చి వాడిలా అందరినీ వెనక్కి తోస్తూ.

విషయం అర్థమై—కేకలు పెడుతూ జీప్‌లోకి దూకా రంతా. అప్పటికే చీకటి ఎక్కువ అవుతోంది.

పిస్తోలు ఉన్న చెయ్యి చాచి, చెట్లువైపు చూసాను. అప్పుడే చెట్ల ఆకుల మధ్యనుంచి నాలుగు కళ్ళు తప్పుకో వడం గమనించాను. ఆలస్యం చేయలేదు నేను. టప టపా కాల్చాను పిస్తోలు ఆవైపు. కెవ్వున ఆక్రందన వినపడింది. రివ్వున అటువైపు పరిగెత్తాను.

ఒకడు నేలమీద బోర్లాపడి కొట్టుకొంటున్నాడు! ఆఖరి క్షణంలో......మరొకడు తూనీగలా పరిగెడు తూండడం నా కంట పడింది.

"అతన్ని వదలకూడదు!"

పరుగెడుతున్న ఆ ఆటవికుని వెంట పిచ్చికుక్కలా పరుగెట్టసాగాను.

వెనకాలనుంచి "భయంకర్! వెనక్కి వచ్చేయ్! కమ్ బాక్!" అన్న పాల్‌మాన్ పిలుపులు పట్టించు కోవడం లేదు నేను.

లేడిలా చెంగు చెంగున దూకుతున్నాడు, ముందు పరు గెడుతున్న ఆటవికుడు.

పిస్తోలు పేల్చాను మరోసారి పరుగెడుతూనే. అతని పాదానికి తగిలింది.

కుంటసాగాడతను.

అయితే కుడివైపు చటుక్కున తిరిగి మాయమయి పోయాడు.

ఒగురుస్తూ ఆ వైపు తిరిగాను.

అతను మలుపు తిరిగినవైపు అటూ, ఇటూ చూసాను.

ఎక్కడా కనపడలేదు ఆ ఆటవికుడు.

ఎక్కడికి మాయం అయిపోయాడు ఈ అరనిముషం టైములో?

చెవులు రిక్కించాను. ఎవరైనా పరిగెడితే ఖచ్చితంగా నలుగుతున్న ఆకుల చప్పుడవుతుంది. ఎక్కడా చీమ చిటుక్కుమన్న శబ్దం కూడా వినపడ్డంలేదు.

'హౌ కేన్ ఇట్ పాసిబుల్?'

అంతలో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది నా మస్తిష్కంలో.

య్యస్...అతని పాదానికి నా పిస్తోలు తూటా తగిలింది. గాయంలోంచి రక్తం...?

నేలను పరీక్షించసాగాను...

రక్తపు చుక్కలు......వరుసగా కనబడ్డాయి. వాటి వెంటే నడుచుకుంటూ వెళ్ళాను.

ఆటవికుడు ఏ చెట్టు చాటునో నన్ను దెబ్బతీయడానికి—పొంచుకొని ఉన్నాడా?

పిస్తోలు ట్రిగ్గర్ గార్డులో—వేలు గట్టిగా బిగించి పిల్లిలా అడుగులు ముందుకు వేయసాగాను.

రక్తపు చుక్కలు నన్ను గుబురుగా వున్న ఓ పొద దగ్గరకు తీసుకు వెళ్ళసాగాయి......

పొదదాకా వచ్చి ఆగిపోయాయి రక్తపు చుక్కలు...!?

పొదను పరీక్షించసాగాను—పిస్తోలు జాగ్రత్తగా పట్టుకొని.

బ్రహ్మాండమైన వెడల్పుగల చెట్టు మొదట్లో అల్లుకుని వుంది ఆ పొద...

యిరవై అడుగులు వుంటుంది ఆ చెట్టు చుట్టుకొలత. అయితే—పొట్టిగా ఉంది.

దాని వయసు కొన్నివేల సంవత్సరాలు ఉంటుందని పించింది చూడగానే—

చెట్టు మొదట్లో రక్తం—మడుగు కట్టింది...

చెట్టుమీద రక్తపు మరకలు పైకి వెళ్ళుతూ కనబడ్డాయి.

అంటే?—

గాయపడిన ఆటవికుడు—ఆ చెట్టుమీదికి ఎక్కి ఉంటాడు. అతి జాగ్రత్తగా దృష్టిని పైకి సారించాను.

ఎక్కడా ఆకుల చప్పుడు కూడా అవటంలేదు. ఇంతలో యెలా మాయమయ్యాడు?

నా గుండె—శబ్దం నాకే వినబడుతోంది.

అంతలో...

వెనుక ఎవరో కదిలిన చప్పుడయ్యింది.

గిరుక్కున వెనక్కి తిరిగాను.

ఆటవికుడు కాదు!

కాన్యోరా!

చేతిలోని పిస్తోలుతో—ఒగురుస్తూ నిలబడిందామె.

బరువుగా ఊపిరి వదిలాను.

ఏదో చెప్పబోయింది శాన్యోరా.

నోటిమీద వ్రేలేసి మాట్లాడ వద్దన్నట్లు సైగ చేశాను.

ఆమెను మెల్లిగా దగ్గరకు పిల్చాను. పసిపిల్లలా శాన్యోరా దగ్గరకు వచ్చింది. ఆమె చెవిలో ఏదో చెప్పాను.

తల వూపిందామె.

ఆ వృక్షం—అతి పొట్టిగా వున్నా వెడల్పాటిది కావడంతో చేతుల్తో పట్టుకుని ఎక్కడం అసాధ్యం.

అరచేతులు సాచాను.

మెట్టులా, దానిమీద, శాన్యోరా కుడిపాదం మోపి చిన్న జర్కుతో పైకి ఎగిరి, అరచేతులమీంచి నా భుజం మీద నిలబడింది.

తల పైకెత్తాను. మెల్లిగా ఓ కొమ్మ నందుకొంది చేతుల్తో. అన్నివైపులా పరీక్షించసాగిందామె కొద్దిసేపు.

రెండు భుజాలమీద రెండుకాళ్ళు వేసి నిలబడ్డంవల్ల అంతకుమించి శాన్యోరా ఏం చేస్తోందో నాకు కనబడ లేదు.

పిక్కలదాకా ఉన్న గౌను—అడ్డం అయింది.

ఉన్నట్టుండి నా భుజాలమీద నిలబడ్డ శాన్యోరా లేత పాదాలు వణికాయ్.

"శాన్యోరా ఏమయింది?" అడిగాను ఉండబట్టలేక.

"భయంకర్! కదలక, గట్టిగా పట్టుకో"అని మాత్రం చెప్పింది.

ఆమె మాటలతో సమానంగా "ధన్...ధన్... ధన్..."మంటూ పిస్తోలు ఆరుసార్లు భయంకరంగా పేలింది.

ఏమయింది?

ఎవర్ని కాలుస్తోంది?

బుర్ర పిచ్చెక్కుతోంది.

"భయంకర్! క్విక్! నీ పిస్తోలు యిటు యియ్యి!" అర్చిందామె మొదటి పిస్తోలును నేలమీదకు విసిరేస్తూ.

పిస్తోలు ఉన్న చెయ్యి గుడ్డిగా పైకెత్తాను.

థన్...థన్...థన్...థన్...థన్...

మరో ఐదుసార్లు భయంకరంగా ప్రేలింది రెండో పిస్తోలు.

"భయంకర్! యిక దింపు!" అందామె అలసటగా, ఒగుర్చుతూ.

చేతులు పైకెత్తి శాన్యోరా నడుం పట్టుకుని, క్రిందకు దింపాను.

అప్పుడు చూశాను...!!

ఆమె కుడిచేతిలో గుచ్చుకొని వ్రేలాడుతున్న ఓ విషపు బాణాన్ని.

నా గుండె ఒక్క క్షణం కొట్టుకోవడం మానేసింది.

"శాన్యోరా! ఏమయింది?" గాభరాతో ఏదో అనబోయా...

"తర్వాత చెప్తాను. ముందు ఈ బాణం లాగెయ్. భయంకర్!" అందామె హఠాత్తుగా తోటకూరకాడలా వెనక్కి వ్రాలిపోతూ.

"సారీ! ఇడియట్‌లా ప్రశ్నించాను. కళ్ళు మూసుకో!"

ఆమె కవ్వున అరుస్తుండగా చటుక్కున బాణాన్ని ఆమె ముంజేతినుండి పెకలించాను.

(సశేషం)